
ధారూరు: రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు


మర్పల్లి : రజతోత్సవ సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణలో శ్రీకాంత్ రెడ్డి, నాయకులు

# చలో వరంగల్

- 27న రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం
- బీఆర్ఎస్ పార్టీ ధారూరు మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

ధారూరు, ఏప్రిల్ 13 : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న రజతోత్సవ సభని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ ధారూరు మండల అధ్యక్షుడు పి.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రం లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో కలిసి చలో వరంగల్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి ఏప్రిల్ 27తో 25 ఏండ్లు పూర్తవుతున్న శుభ తరుణంలో నిర్వహించే ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు వేణుగోపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, దేవేందర్, వెంకటయ్య, గోవింద్, రాజ్‌గౌడ్, చిన్నయ్యగౌడ్, శశిధర్ రెడ్డి, మహేశ్‌కుమార్, అంజయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### రజతోత్సవ సభకు తరలిరావాలి

**మర్పల్లి :** వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దామని పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మర్పల్లిలో మండల నాయకులతో కలిసి చలో వరంగల్ (బీఆర్ఎస్ రజతోత్సవ) వాల్ పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సభ కోసం మండలం నుంచి 12 ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. సభకు వెళ్లే ముందు ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించాలని కోరారు. మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాచయ్య, ఉపాధ్యక్షులు రమేశ్ మిత్ర, జైహింద్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు మధుకర్, టౌన్ ప్రెసిడెంట్ గఫార్, గౌస్, సొసైటీ డైరెక్టర్ యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ రాజు, వికాస్, నవీన్, బాలేశ్, రాందాస్, దీపక్ ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నజీరాబాద్‌తండాలో తాగునీటికి కటకట

**ప్రైవేటు వ్యక్తుల వద్ద ట్యాంకర్ల ద్వారా నీటి కొనుగోలు**


ట్యాంకర్ ద్వారా ఇంటి వారికి పైప్‌తో నీరు అందజేస్తున్న దృశ్యం

పరిగి, ఏప్రిల్ 13 : పరిగి మున్సిపాలిటీ పరిధిలోని నజీరాబాద్‌తండాలో తాగునీటి ఎద్దడి నెలకొంది. కొన్ని రోజుల నుంచి నీటి కష్టాలతో ప్రజలు నానా పాట్లు పడుతున్నారు. అసలే ఎండల తీవ్రత అధికమైన నేపథ్యంలో నీటి సరఫరా సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. నజీరాబాద్ తండాలో మిషన్ భగీరథ నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉండడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ప్రతిరోజు మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తున్నా సరిపోవడం లేదని వాపోతున్నారు. తండాలో చాలా ఇండ్లకు మిషన్ భగీరథ నీరు రావడం లేదని తెలిపారు. ఇటీవల మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ వద్ద చెర్రలు తీసివేయడంతో కొందరికి అవసరం మేరకు నీరు సరఫరా అవుతుండగా మిగతా వారికి కనీసం రెండు బిందెల నీరు రాలేని పరిస్థితి నెలకొంది. కొన్ని రోజుల నుంచి అవసరమైన వారు కొంతమంది ప్రైవేటు ట్యాంకర్ ద్వారా మంచినీరు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒక ట్యాంకర్ నీటికి సుమారు రూ.500 నుంచి రూ.800 వరకు వెచ్చించాల్సి వస్తుందని తెలిపారు. ఒకరిద్దరు కలిసి ప్రైవేటు వ్యక్తుల వద్ద ట్యాంకరు నీరు కొనుగోలు చేస్తున్నారు. నీరు సరిగ్గా రావడం లేదని పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని తండావాసులు తెలిపారు. డబ్బులు ఖర్చు చేసి నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తండాకు సరిపడా తాగునీరు సరఫరా చేయాలని, లేనిపక్షంలో బోర్లు ప్రత్యేకంగా వేయించి సింగిల్‌ఫేజ్ మోటార్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గతంలో పాలకవర్గం ఉన్న సమయంలో తండాకు సమీపంలో గల ఓపెన్ వెల్ నుంచి నీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం ఈ అంశం అసలు పట్టించుకోవడం లేదని తెలిపారు.

# ఘనంగా సాయిబాబా ధ్యాన మందిర వార్షికోత్సవం


సాయిబాబా ప్రత్యేక పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 13 : పరిగి పట్టణంలోని షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం సాయి సత్య వ్రతాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో సాయి సత్యవ్రతాల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పాల్గొన్నారు. సాయి పురోహితులు వార్షిక ఉత్సవాలు జరిపించారు. ఉత్సవాల్లో దోమ మాజీ జెడ్పీటీసీ కొప్పుల నాగారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎ.సురేందర్, సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని పోల్కంపల్లిలో మల్లన్న స్వామి ఆలయం ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం.. ఇదిగో సాక్ష్యం!

- ఎండిన వేలాది మొక్కలు
- నర్సరీలో మొక్కలకు నీరు పోయక.. నజీరాబాద్‌తాండలో ఎండిపోయిన మొక్కల దుస్థితి
- అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు


నర్సరీలో ఎండిపోయిన మొక్కలు


వృథాగా పడివున్న ట్యాంకు

పరిగి, ఏప్రిల్ 13 : పచ్చదనం పెంపుతో పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని బీఆర్ఎస్ ప్రభుత్వం మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వగా నేడు అందుకు పూర్తి విరుద్ధమైన పరిస్థితి నెలకొంది. అప్పట్లో కనీసం ఆరు నెలలకు ముందుగానే ప్రతి గ్రామంలో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచి వర్షాకాలంలో నాటేవారు. అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా, కనీసం నీరు పోయలేక ఏకంగా వేలాది మొక్కలు నర్సరీలోనే ఎండిపోయాయి. అసలు నర్సరీ ఉందా అనేది సైతం అధికారులు అటువైపు చూడనట్లుగా పరిస్థితి కనిపిస్తుంది. వివరాల్లోకి వెళ్తే.. పరిగి మండల పరిధిలోని నజీరాబాద్‌తండా గ్రామ పంచాయతీ మూడు నెలల క్రితం పరిగి మున్సిపాలిటీలో విలీనమైంది. దీ గ్రామ పంచాయతీ కార్యదర్శి సైతం మున్సిపల్ పరిధిలోకి వచ్చారు. గ్రామ పంచాయతీలో పనిచేసే సిబ్బంది మున్సిపల్ పరిధిలోకి వచ్చారు. ఇక్కడి వరకు అంతా బాగున్నది. గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్ పరిధిలోకి వస్తే మరింత బాగుపడుతుందనుకుంటే కనీసం మొక్కలు పెంచలేని దుస్థితి నెలకొంది. నజీరాబాద్ తండా సమీపంలోని పల్లె ప్రకృతివనంలోనే గత కొన్నేండ్లుగా నర్సరీ ఏర్పాటుచేసి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం చేపట్టేవారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక ట్యాంకు ఏర్పాటుచేసి ట్యాంకర్ ద్వారా నీరు తీసుకొచ్చి దానిలో పోసి రోజు మొక్కలకు నీరు పట్టేవారు. తద్వారా మొక్కలు ఏపుగా పెరిగేవి. ఇదంతా గతం. నజీరాబాద్‌తండా పరిధిలోని నర్సరీలో వేలాది మొక్కలు పెంపకానికి పెట్టారు. వాటికి కనీసం నీరు పట్టకపోవడంతో మొక్కలన్నీ ఎండిపోయిన పరిస్థితి. ఒక మొక్క నాటడం ద్వారా పర్యావరణానికి ఎంతో హితం చేసిన వారమవుతాం. కానీ వేలాది మొక్కలకు కనీసం నీరు సైతం పోయలేని పరిస్థితి. అసలు పట్టింపులేని ధోరణితో ట్యాంకు నుంచి పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా జరిగే పైపులన్నీ పనికిరాకుండా పోయాయి. మొక్కలు పూర్తిగా ఎండిపోవడానికి కారణం మున్సిపల్ అధికారుల పర్యవేక్షణా లోపమనే విమర్శలున్నాయి. గ్రామపంచాయతీ మున్సిపాలిటీలో విలీనమైన తర్వాత నర్సరీలో మొక్కల పెంపకం ఎలా జరుగుతుంది తదితర అంశాలను పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరించడంతో వేలాది మొక్కలు ఎండిపోయాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మున్సిపాలిటీలోకి విలీనమైన గ్రామాల్లో పాలన పడకేసిందనడానికి ఇదో ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొంటున్నారు. అధికారులు ఏనాడు వచ్చి చూడలేదన్నది అక్కడి ఎండిపోయిన మొక్కలను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. నర్సరీ బోర్డు సైతం ఓ మూలన పడేశారంటే వాటిపై ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నారన్నదానికి ఉదాహరణ. మొక్కలు ఎండిపోయిన ఘటనకు సంబంధించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# వికారాబాద్‌కు జై భీమ్ జై భారత్ యాత్ర


జైబీమ్, జై భారత్ యాత్రలో పాల్గొన్న సమాజ సేవకుడు పెద్దింటి శ్రీకాంత్ తదితరులు

వికారాబాద్, ఏప్రిల్ 13 : జై భీమ్ అనేది పలకరింపు కాదని, అది అంబేద్కర్ ఉద్యమ నినాదంగా మారిందని సమాజ సేవకుడు పెద్దింటి శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం జై భీమ్ జై భారత్ యాత్ర వికారాబాద్‌కు చేరుకున్నది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ అందరివాడు అనే భావన ప్రతి ఒక్కరిలో రావాలని కోరారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఒకరోజు ముందు యాత్రలో భాగంగా మండల పరిధిలోని సిద్దులూర్, పులుసుమామిడి, ధన్నారం గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో పాతూరు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్



పెద్దేముల్, ఏప్రిల్ 13 : మండల పరిధిలోని మంసాన్‌పల్లి గ్రామానికి చెందిన మూడావత్ నిఖిత రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. దాసడి విజయ్ బాక్సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లాలాపేటలో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 11, 12 తేదీల్లో ఏడో యూత్ బాక్సింగ్ రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. అండర్ 19 మహిళల కేటగిరీ 45, 48 కేజీల విభాగంలో నిఖిత గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా యువతి తల్లిదండ్రులు దేవీబాయి విఠల్ నాయక్‌తో పాటు గ్రామస్తులు అభినందించారు. నిఖిత ప్రస్తుతం నార్సింగ్‌లోని గిరిజన గురుకులంలో చదువుతున్నది.

# కంపుకొడుతోంది


నవాబుపేటలోని ప్రధాన చౌరస్తాలో మురుగు కాల్వలో పేరుకుపోయిన చెత్త


నవాబుపేట, ఏప్రిల్ 13 : మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో మురుగు అస్తవ్యస్తంగా మారడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. అటు నుంచి వెళ్లే వాహనదారులు, బాటసారులు దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాల్వను శుభ్రం చేయకపోవడంతో చెత్త చెదారంతో నిండిపోయింది. మురుగులో నుంచి తాగునీటి పైపులైన్ ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పైపులైన్‌లకు లీకేజీలు ఏర్పడితే నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఆర్‌వైవీ దరఖాస్తులకు గడువు పెంచాలి

బొంరాస్‌పేట, ఏప్రిల్ 13 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని బొంరాస్‌పేట యువజన సంఘం మండల అధ్యక్షుడు గంగిశెట్టి విజయ్‌కుమార్ కోరారు. నాలుగు రోజుల నుంచి యువత మీ సేవా కేంద్రాల దగ్గర గంటల కొద్ది సమయం వేచి ఉంటున్నరన్నారు. ఆదాయం, కులం సర్టిఫికెట్స్ కోసం వరుస సెలవులు రావడంతో రోజుల తరబడి వేచి చూసే పరిస్థితి ఉందన్నారు. ఈ నెల 14 వరకు గడువు ఉండడంతో సర్వర్ డౌన్ సమస్యతో యువతీయువకులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం మరో సారి గడువు పెంచాలని ఆయన కోరారు.

# ఇన్సూరెన్స్‌పై సైబర్ వల

- పాలసీలు, రెన్యువల్స్ పేరుతో మోసాలు
- డేటా ప్రొవైడర్ల నుంచి పాలసీదారుల సమాచార సేకరణ
- సైబర్‌క్రైమ్ పీఎస్‌లో పెరుగుతున్న కేసులు




సిటీబ్యూరో, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి పలు సంస్థలకు చెందిన ఇన్సూరెన్స్ పాలసీలు ఉన్నా యి. పాలసీకి చెందిన డబ్బులు మీ ఖాతాలో జమ చేస్తామంటూ నమ్మించిన సైబర్ నేరగాళ్లు అతడి నుంచి రూ.5.81లక్షలు కొట్టేశారు. పాలసీ మొత్తాన్ని జమ చేయాలంటే మీరుకొంత మొత్తాన్ని ఒక అకౌంట్‌లో వేయాలని చెప్పగా.. నేరగాడు సూచించిన ఖాతాకు బాధితుడు ఈ మొత్తాన్ని డిపాజిట్ చేశాడు. ఎన్నిరోజులైనా పాలసీ డబ్బులు రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
నగరంలో సేల్స్‌మెన్‌గా చేస్తున్న యువకుడికి ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నానం టూ ఓ వ్యక్తి కాల్‌చేశాడు. మీరు బీమా పాలసీకి సంబంధించిన డబ్బు కట్టాల్సి ఉందని, మీము ఓ లింక్ పంపిస్తే అది క్లిక్ చేసి ఆ డబ్బు లు కట్టేయాలని సూచించారు. దానికి ఆ సేల్స్‌మెన్ ఓకే చెప్పాడు. దీంతో ఆ వెంటనే నిందితుడు బీమా సంస్థ పేరుతో ఏపీకే ఫైల్ పంపాడు. ఆ ఫైల్‌ను సేల్స్‌మెన్ క్లిక్ చేయగా యాప్ డౌన్‌లోడ్ అయ్యింది. ఆ యా ప్ డౌన్‌లోడ్ అయిన వెంటనే రూ.2.17 లక్షలు ఖాతా నుంచి బదిలీ అయ్యాయి. దీంతో చేసేది లేక ఆ బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

### ఇలా వారంలో ఒకట్రెండు జరుగుతున్నాయంటున్న పోలీసులు

మీ ఫోన్‌కు ఇన్సూరెన్స్ పాలసీలు, రెన్యువల్ పేరుతో మెసేజ్‌లు వస్తున్నాయా? ఫోన్‌కాల్స్, లింక్‌లు వస్తున్నాయా.. అయితే జాగ్రత్త, ఇది సైబర్ దొంగల పనిఅయ్యే అవకాశం ఎక్కువ. ఏమరుపాటున ఆ లింకులను క్లిక్ చేస్తే నిండా మునిగినట్లే..! అని హెచ్చరిస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ రూపాల్లో ఆశలు పెట్టి మోసాలకు పాల్పడుతున్నసైబర్ నేరగాళ్లు ఇప్పుడు బీమారంగంపైనా వల విసురుతున్నారు. బీమా బదలాయింపులు, సాం కేతిక సమస్యల సాకుతో, రెన్యువల్స్ పేరుతో సైబర్ దొంగలు మోసాలకు పాల్పడుతున్నారు. ప్రముఖ బీమా కంపెనీల పేర్లతో నకిలీ ఈ మెయిల్స్, మెసేజెస్ పంపి డబ్బులు కొల్లగొడుతున్న సంఘటనలు ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగిపోయాయని సైబర్‌క్రైమ్ పోలీసులు తెలిపారు. గత మూ డు నెలల్లో సైబర్ పీఎస్‌కు వచ్చిన కేసుల్లో ఈ తరహా కేసులు దాదాపు 30శాతం ఉన్నాయని వారు పేర్కొన్నారు. మార్చి నెలాఖరులోగా గడువు ముగుస్తుందంటూ, ఒకవేళ కట్టకపోతే కట్టిన పాత డబ్బులు పోతాయంటూ బెదిరించి వారు పంపే లింక్‌లలో డబ్బులు కట్టాలం టూ ఒత్తిడి చేస్తున్నారు. ఇలా కట్టి మోసపోయిన బాధితుల్లో ఎక్కువగా విద్యావంతులు, వృద్ధులు ఉండటం గమనార్హం.

### ప్రొవైడర్ల నుంచి డేటా కొనుగోలు

ఇన్సూరెన్స్ వివరాలు, వాటి గడువు, ఇతరత్రా సమాచారం అటు పాలసీదారులకు, ఇటు ఇన్సూరెన్స్ కంపెనీలకు మాత్రమే తెలుస్తాయి అయితే సైబర్ నేరగాళ్లు ఈ వ్యక్తిగత సమాచారాన్ని అడ్డదారుల్లో కొనుగోలు చేస్తున్నారు. డేటా ప్రొవైడర్లు, బ్రోకింగ్ కంపెనీలు రూ.10వేల నుంచి రూ.50 వేల వరకు డబ్బులు ఇస్తే లక్షలాది మంది పాలసీదారుల వివరాలను అందిస్తున్నాయి. ఇందులో పాలసీ వివరాలు, వాటి గడువు, వాహనాల నంబ ర్లు, వాటి ఇన్సూరెన్స్ పాలసీలు.. ఇలా పూర్తిగా వ్యక్తిగత వివరాలు ఉంటున్నాయి. ఈ సమాచారంతో సైబర్ నేరగాళ్లు పాలసీదారులకు ఫోన్లు చేస్తూ, మెసేజ్‌లు పంపుతూ కొత్త బీమా, రెన్యువల్‌తో అధికలాభాలు, బహుమతులు అందుకోవచ్చని ఆశ చూపుతున్నారు. కొంత మంది పాలసీదారులను నమ్మించి బ్యాంక్ ఖాతా వివరాలను సేకరిస్తున్నారు. ఆ తర్వాత వారి అకౌంట్లలో ఉన్న డబ్బులు కొట్టేస్తున్నారు. ఇటువంటి వాటిలో రిటైర్డ్ ఉద్యోగులు, పాలసీ దగ్గరపడి కొన్ని రోజుల్లోనే అయిపోతుందనుకున్న వారు ముందస్తుగా చెల్లిస్తే మీకు బహుమతులు వస్తాయంటూ ఆశపెట్టడంతో వారు ఇలాంటి ప్రలోభాలకు లొంగిపోయి తమ ఖాతాల వివరాలు చెబుతున్నట్లు సైబర్ పోలీసులు తెలిపారు.

### వివరాలు అడిగితే మోసమే..!

సైబర్ నేరగాళ్లు మొదట ఫోన్ చేసి రెన్యువల్స్, పాలసీలపై మాట్లాడి ఆ తర్వాత అవసరమైతే కొత్త పాలసీల విషయాలు చెప్పి అందుకు వారి వ్యక్తిగత వివరాలు అడుగుతున్నారు. అటువంటి సందర్భంలో అలా చేసిన వారు సైబర్ మోసగాళ్లే అని గ్రహించమంటున్నారు సైబర్ పోలీసులు. ఎట్టి పరిస్థితుల్లో ఇన్సూరెన్స్ కంపెనీలు రెన్యువల్స్, పాలసీ బదలాయింపు పేరుతో పంపే మెసేజ్ ఈమెయిల్స్‌లో పేమెంట్స్ లింక్స్ ఇవ్వవని, ఇన్సూరెన్స్ వెరిఫికేషన్ కోసం పాన్, ఆధార్ నంబర్లు, బ్యాంక్ వివరాలు అడగవని, ఇలా అడిగారంటే అది మోసమేనని గుర్తించమని వారు చెప్పారు. ఇన్సూరెన్స్‌కు సంబంధించి ఎలాంటి విషయమైనా సదరు ఏజెంట్‌ను స్వయంగా కలిసి కానీ, లేక సంస్థ ఆఫీసులకు వెళ్లి అక్కడ వివరాలు తీసుకోవాలి తప్ప ఆన్‌లైన్‌లో వచ్చే ఏ మెసేజ్‌లకు స్పందించవద్దని పోలీసులు సూచించారు. మరోవైపు ఎల్ఐసీ ఇండియా యాప్ అని చూపించే ఫేక్ యాప్‌ను మీరు ఉపయోగిస్తే లేదా చూసిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలంటూ ఎల్ఐసీ ఇటీవల నోటీస్ జారీ చేసింది. ఎల్ఐసీ పేరుతో కనిపించే ఇలాంటి యాప్స్ నిజంకాదని తెలిపింది. దీనివల్ల డబ్బులు కోల్పోయే ప్రమాదముందని, ఇలాంటి మొబైల్ యాప్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ సూచించింది.


## బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి

బషీరాబాద్, ఏప్రిల్ 13 : రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ చేస్తున్న కుట్రను తిప్పికొట్టాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. జైబాపు, జైభీం, జైసంవిధాన్ అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని కాంసన్‌పల్లి(బి) గ్రామం నుంచి ఎక్మాయి వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న నవీన్, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు వెంకట్

కులకచర్ల, ఏప్రిల్ 13 : మండల పరిధిలోని ఘనాపూర్ గ్రామ పంచాయతీ సక్ర్యానాయక్ తండాలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణానికి పలువురు విరాళం అందజేవారు. ఆలయ నిర్మాణానికి నవీన్ రూ.15వేలు విరాళం అందించినట్లు ఘనాపూర్ బీఆర్ఎస్ నాయకుడు వెంకట్ తెలిపారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకొచ్చి విరాళాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.


మండల పరిధిలోని తిమ్మాయిపల్లిలో నిర్వహించిన ఉర్సులో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. - దోమ, ఏప్రిల్ 13


# ఉద్యోగం పేరుతో రూ.2.57 లక్షలు టోకరా

సిటీబ్యూరో, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): ఇంగ్లీష్‌లో ఉన్న నవలలు ఖాళీ పేపర్లలో చేతితో రాసి తమకు పంపించాలంటూ పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో సైబర్ నేరగాళ్లు ఒక మహిళను రూ. 2.57 లక్షలు ముంచారు. పోలీసుల కథనం ప్రకారం.. ఘ ట్‌కేసర్‌కు చెందిన బాధితురాలి కూతురు స్కూల్‌లో చదువుతోంది. ఆమె తన స్నేహితులతో పార్ట్‌టైమ్ ఉద్యోగం విషయంలో 'ది ఫెడరేషన్ ఇండియా పబ్లికేషన్' అనే సంస్థ చేతి రాతతో రాసేందుకు నావెల్స్‌ను ఇస్తున్నారని చర్చించుకున్నారు. ఈ విషయం విన్న ఆమె తన స్నేహితురాలితో మాట్లాడుతుండగా నా వద్ద వాళ్ల ఫోన్ నంబర్ ఉందంటూ ఆమె ఇచ్చింది. బాధితురాలు ఆ నెంబర్‌కు వాట్సాప్‌లో మేసేజ్ పెట్టడంతో.. అవును మాది ఇంగ్లీష్ హ్యాండ్‌రైటింగ్ జాబ్ అంటూ చెప్పుకున్నారు. మొదట మీరు రూ. 499 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే మీకు నావెల్స్, ఖాళీ పేపర్లు పంపిస్తామంటూ చెప్పారు. నిజమని నమ్మిన బాధితురాలు అందుకు ఒప్పుకుంది. ఈ క్రమంలోనే మీకు బుక్స్ డెలివరీకి పంపిస్తున్నామని, డెలివరీ చార్జీలు రూ. 1999 చెల్లించాలంటూ సూచించడంతో బాధితురాలు చెల్లించింది. తరువాత మీకు 70 శాతం అడ్వాన్స్ జీతం పంపిస్తున్నామని, బ్యాంకులో సాలరీ ఖాతా తెరిచేందుకు మీ వివరాలు ఇవ్వండంటూ నమ్మించారు.ఆ తరువాత జీఎస్టీ చెల్లించాలని డబ్బు వసూలు చేశారు. మీరు మొదట్లో చెల్లించే డబ్బంతా తిరిగి మీకు వాపస్ వస్తాయని, ఇదంతా మొదటి జీతంలో కలిపే వస్తాయంటూ నమ్మించారు. తిరిగి బ్యాంకు వెరిఫికేషన్, పెండింగ్, ఎన్ఓసీల ఫీజులంటూ దఫ దఫాలుగా ఆమె వద్ద నుంచి రూ. 2,57,192 సైబర్‌నేరగాళ్లు వసూలు చేశారు. ఇంకా డబ్బు అడుగుతుండటంతో ఇదంతా మోసమని గుర్తించిన బాధితురాలు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

పరిగి, ఏప్రిల్ 13 : అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని పరిగి మండల పరిధిలోని గడిసింగాపూర్ గ్రామంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణకు అన్ని రంగాల విద్యావేత్తలు, యువకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

## వృథాగా పశువుల నీటి తొట్టె


పర్వతాపూర్‌లో నిరుపయోగంగా పశువుల నీటి తొట్టె

తాండూరు రూరల్, ఏప్రిల్ 13 : వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటితొట్టె వృథాగా మారింది. మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామంలో నిర్మించిన పశువుల నీటి తొట్టెను ఎవరూ పట్టించుకోవడం లేదు. వేసవిలో వాటిని అందుబాటులోకి తీసుకొస్తే, పశువులకు మేలు జరుగుతుందని రైతులు చెబున్నారు. నిర్మించిన నాటి నుంచి అందులోకి నీటిని వదలడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**BEFORE THE SOLI ARBITRATER/ ASST.REGISTRAR OF CHITS AT MAHABUBNAGAR**
**Arbitration case No.365 OF 2024**
**Between**
SHRIRAM RAGHAVENDRA CHITS PVT. LTD., ...DISPUTANT/PETITIONET
And
K. Gnaneshwarand Others ...OPPONENTS
**NOTICE**
2. K. Mallesh S/o K. Bheerappa, Aged: 37 years, Occ: Secondary Grade Teacher, Emp. ID: 1469302, O/o. Mandal Parishath Primary School, Gummalakucha Thanda Village, Chowdapur Mandal, Vikarabad Dist, Cell No. 9701261009.
Take notice that the above Arbitration case filed by the Disputant to recover the chits dues under A.P.Chit Fund Act. And Rules of 2008 against you and Others. You are avoiding the notice, hence we are publishing notice on you to appear before the Arbitrator H.No. 7-5-108/2/A, Registration office, 1st Floor, Opp: Hidustaion Petrol Bank, Venkateshwara Colony, Maha bubnagar On **19-04-2025** at **11-30 A.M.** for your appearance in person or through an advocate, in case you failed to appear before this Hon'ble Arbitrator the claim will be decided ex-parte.
**"BY THE ORDER OF THE ARBITRATOR"**
**Mahabubnagar**
**ABDULKHADER Advocate**
**H.No.4-2-16/6/H/2/5, Ramaiah Bowli**
**Mahabubnagar . Cell No.9849894232**